నత్తనడకన రోడ్డువిస్తరణ పనులు

- ప్రారంభించి 6నెలలైనా 50శాతం కూడా పూర్తికాని పనులు
- రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్
- ఇబ్బంది పడుతున్న ప్రజలు, వ్యాపారస్తులు
- కొరవడిన అధికారుల పర్యవేక్షణ


దుకాణాల ఎదుట డ్రెయినేజీ నిర్మాణం కోసం తవ్వి వదిలేసిన కాంట్రాక్టర్


నాణ్యతలేని మట్టితో చేపడుతున్న రోడ్డు పనులు

నార్కట్‌పల్లి : నార్కట్‌పల్లి పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. పట్టణంలో 3కిలోమీటర్ల మేర రూ.16కోట్లతో రోడ్డు విస్తరణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఇందులో రోడ్డు విస్తరణ పనులతో పాటు సెంటర్ లైటింగ్ ఏర్పాటు, సైడ్ డ్రెయినేజీల నిర్మాణాలు చేపట్టాల్సిఉంది. ప్రభుత్వం అందుకు ఓ కాంట్రాక్టర్‌కు పనులను కట్టబెట్టింది. సదరు కాంట్రాక్టర్ రూ.16కోట్లతో ఈఏడాది మే 28న పనులు ప్రారంభించారు. పనులు మొదలుపెట్టి 6నెలలు దాటినా నేటికి 50శాతం కూడా పూర్తి చేయకుండా నత్తనడకన సాగిస్తున్నారు. దీంతో పనులు ప్రారంభం నుంచి పట్టణ ప్రజలకు, ఇతర గ్రామాలను నుంచి వచ్చే వారికి తీవ్ర ఇబ్బందులు తప్పడం లేదు. పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు ఏమాత్రం నిబంధనలు పాటించకుండా కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా చేపడుతున్నా సంబంధిత అధికారులు పర్యవేక్షణ లేకపోవడంతో పనుల్లో జాప్యం, నాణ్యతలోపిస్తుందని పులువురు పట్టణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

ప్రణాళిక లేకుండా..

రోడ్డు విస్తరణ పనుల్లో కాంట్రాక్టర్ ప్రణాళిక ప్రకారం పనులు చేపట్టకుండా ఒకవైపు రోడ్డు పనులు పూర్తి అయిన తర్వాత మరో వైపు చేపట్టాల్సి ఉన్నా అవి పట్టించుకోకుండా రోడ్డు మొత్తాన్ని తవ్వడంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అదే విధంగా పని ప్రదేశాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వాహనదారులు రాత్రి సమయాల్లో ప్రమాదానికి గురవుతున్నారు. అదే విధంగా నాణ్యత లేని మట్టిని రోడ్డుకు వాడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

వ్యాపారస్తుల ఆందోళన..

రోడ్డు విస్తరణలో కంకర పరిచి రోలింగ్ చేయకపోవడంతో వాహనాలు రోడ్డపై వెళ్లడంతో కంకర షాపులపై పడి ప్రమాదానికి గురవుతున్నారు. అదే విధంగా దుకాణాల ఎదుట డ్రెయినేజీ కోసం కాల్వను తవ్వీ రోజులు గడుస్తున్నా కాంట్రాక్టర్ పనులు చేపట్టకపోవడంతో వ్యాపారస్తులు నష్టపోతున్నారు. డ్రెయినేజీ నిర్మాణం జాప్యంతో నల్లగొండ చౌరస్తాలో మురుగునీరు చేరి అధ్వానంగా మారుతుంది.

విస్తరణ పనులు త్వరగా చేయాలి



పట్టణంలో చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లోపంతోనే కాంట్రాక్టర్ విస్తరణ పనులు నిర్లక్ష్యంగా చేస్తున్నారు. త్వరగా పనులు పూర్తి చేసి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

– ఏళ్ల వెంకన్న, వ్యాపారి

పట్టించుకోని అధికారులు..

రోడ్డు విస్తరణకు నాసిరకం మట్టి వాడుతున్నా, పనిప్రదేశాల్లో సూచికబోర్డులు లేకుండా పనులు చేపడుతున్నా, నత్తనడకన పనులు సాగిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంతో కాంట్రాక్టర్‌తో అధికారులు కుమ్మక్కైనట్లు పలువురు పట్టణ ప్రజలు గుసగుసలాడుకుంటున్నారు.

క్లుప్తంగా

కరాటే క్రీడాకారులకు బెల్ట్‌లు అందజేత


కలర్‌బెల్ట్‌లు అందజేస్తున్న కనకారావు

నల్లగొండ టూటౌన్ : పట్టణంలోని వినాయక హౌజింగ్ బోర్డులో షావోలిన్ షోటోఖాన్ స్పోర్ట్స్ కరాటే ఇండియాకు చెందిన విద్యార్థులకు శనివారం కలర్ బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ నిర్వహించారు. ఈ టెస్ట్‌లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు కరాటే ఇండియా ఫౌండర్ నాంపల్లి కనకారావు కలర్ బెల్ట్‌లు, సర్టిఫికెట్‌లు అందజేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రెసిడెంట్ స్వామిగౌడ్, వైస్‌ప్రెసిడెంట్ నూనె రవీందర్‌యాదవ్, చింతరెడ్డి జయందర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి 'దివీస్' సహకారం అభినందనీయం


విద్యార్థులకు బ్యాగులు, చెప్పులు అందజేస్తున్న సర్పంచ్ పుష్ప

చిట్యాల : గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి దివీస్ పరిశ్రమ యజమాన్యం అందిస్తున్న సహకారం అభినందనీయమని సర్పంచ్ రత్నం పుష్ప అన్నారు. శనివారం మండలంలోని గుండ్రాంపల్లి గ్రామంలోని జెడ్పీహెచ్ఎస్, మండల పరిషత్ పాఠశాలల్లోని విద్యార్థులకు దివీస్ పరిశ్రమ యజమాన్యం రూ.2,98,552తో ఏర్పాటు చేసిన స్కూల్ బ్యాగులను, చెప్పులను ఆమె అందజేసి మాట్లాడారు. విద్యార్థులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు కొండకింది అంజిరెడ్డి, జి.వెంకట్‌రెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్లు బి.నర్సింహ, బి.మధుసూదన్, దివీస్ పరిశ్రమ సీఎస్ఆర్ ఇన్‌చార్జ్‌లు వల్లూరి వెంకటరాజు, ఎస్.సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సత్తయ్య సేవలు మరువలేనివి


సత్తయ్య స్మారకస్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

మునుగోడు : సీపీఎం పార్టీ బలోపేతానికి సత్తయ్య చేసిన సేవలు మరువలేనివని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని కొరటికల్ గ్రామానికి చెందిన సీపీఎం నాయకుడు బోడిష సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో ఆయన స్మారకార్థం నిర్మించిన స్థూపాన్ని శనివారం సుధాకర్‌రెడ్డి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా నాయకుడు మాలిగ యాదయ్య, నాయకులు నాంపల్లి చంద్రమౌళి, సాగర్ల మల్లేష్, మొగుదాల వెంకటేష్, వరికుప్పల ముత్యాలు, ధనంజయ్య, మందుల పాండు, యసరాని శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నీటి వసతి కల్పించాలని వినతి


మున్సిపల్ చైర్మన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

చిట్యాల : పట్టణంలోని 8వ వార్డు పరిధిలోని కేఎస్ఆర్ వెంచర్ వాసులకు నీటి సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆ కాలనీవాసులు శనివారం స్థానిక మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ మందడి రామదుర్గారెడ్డికి వినతిపత్రం అందజేశారు. నీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. అందుకు చైర్మన్, కమిషనర్ స్పందించి తగిన నీటి సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి చికిలంమెట్ల అశోక్, కాలనీవాసులు మిర్యాల అశోక్, రమేష్, జాని భరత్, యాదగిరి, వెంకన్న తదితరులు ఉన్నారు.

సభను నిర్వీర్యం చేయడం తగదు

చండూరు : భారత చైతన్య యువజన పార్టీ ఆధ్వర్యంలో ఏపీలోని పుంగనూరులో శుక్రవారం నిర్వహించే 'రైతు భేరి' సభను పోలీసులు నిర్వీర్యం చేయడం తగదని ఆ పార్టీ మునుగోడు నియోజకవర్గం ఇన్‌చార్జ్ అచ్చన శ్రీనివాసులు శనివారం ఓ ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఆ పార్టీ జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు బోడె రామచంద్రంయాదవ్ కుటుంబ సభ్యులను గుడికి కూడా వెళ్లకుండా నిర్బంధించడం వంటి చర్యలకు పాల్పడడం సరికాదన్నారు.

కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటా

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే లింగయ్య, పక్కన జెడ్పీ చైర్మన్ నరేందర్‌రెడ్డి

నకిరేకల్ : ఎన్నికల్లో ఓడినా కార్యకర్తలకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ఎవరూ మనోధైర్యం కోల్పోవద్దని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యకర్తలందరూ సమష్టిగా ఉండి పార్టీ కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లాలని కోరారు. కార్యకర్తలకు ఏసమస్య వచ్చినా ఎప్పటిలాగానే తనను సంప్రందించాలన్నారు. అనంతరం జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి మాట్లాడారు. వచ్చే స్థానిక సంస్థలు, పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపుకోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేగట్టే మల్లిఖార్జున్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, నాయకుడు నలగాటి ప్రసన్నరాజ్, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, జెడ్పీటీసీ మాద ధనలక్ష్మి, ఆయా మండలాల, పట్టణ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి


మాట్లాడుతున్న మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్

మర్రిగూడ : మండలంలో బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు తమవంతుగా కృషి చేయాలని భువనగిరి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికలు ఏవైనా పార్టీ దిశానిర్దేశాన్ని అనుసరిస్తూ ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పిట్టల శ్రీనివాస్, జిల్లా కిశోర్, లాలునాయక్, రాజేందర్‌నాయక్, పంగ యాదయ్య, గ్యార యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయాల్లో ధునుర్మాస ఉత్సవాలు


విద్యుత్ దీపాలంకరణలో రామగిరిలోని రామాలయం

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని రామగిరి శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంతో పాటు, వీటీ కాలనీలోని శ్రీదేవి భూదేవి సహిత వేంకటేశ్వరస్వామి, దేవరకొండ రోడ్డులోని సిద్ధార్థకాలనీ వేంకటేశ్వరస్వామి, పాతబస్తీలోని సంతోషిమాత ఆలయాల్లో నేటి నుంచి జనవరి 14వరకు నెల రోజుల పాటు ధనుర్మాస వ్రత మహోత్సవాలు ఘనంగా జరగనున్నాయి. నెల రోజుల పాటు ప్రతి రోజు ఉదయం సుప్రభాతం, మంగళవాయిద్యం, ఆరగింపు, అర్చనలు చేపట్టనున్నారు. సాయంత్రం విష్ణుసహస్రనామ పారాయణం, అమ్మవారి పల్లకి సేవలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఆలయాలను విద్యుత్‌దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరిచారు. చివరి రోజు శ్రీ గోదారంగమున్నార్ తిరుకల్యాణ మహోత్సవంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు


రామగిరి : క్రీస్తు సందేశం ఇస్తున్న ఫాదర్ జూలియన్

రామగిరి (నల్లగొండ) : పట్టణంలో తొగట వీరక్షత్రియ సంఘం ఆధ్వర్యంలో శనివారం సెమీక్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో రెవరెండ్ ఫాదర్ జూలియన్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేసి కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. క్రీస్తు జననం, ప్రేమ, అనురాగాల గురించి వివరించారు. ప్రభువును ఆరాధిస్తూ పేదలకు సాయం చేసే సేవా గుణాన్ని పెంపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో పసల శౌరయ్య, లూర్థురాజు, మాదాసు చిన్నయ్య, పి.అంతయ్య, ఎం.అంథోని, తొగట వీరక్షత్రియ సభ్యులు పాల్గొన్నారు.

కిస్మస్ వేడుకలకు చర్చీలు ముస్తాబు

మర్రిగూడ : క్రైస్తవుల పవిత్ర పండుగైన క్రిస్మస్ వేడుకలను పది రోజుల ముందు నుంచే క్రైస్తవులు ఆయా గ్రామాల్లోని చర్చిలను ముస్తాబు చేస్తున్నారు. అందులో భాగంగానే మండలంలోని రాజాపేటతండాలోని చర్చిని శనివారం విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు.

అలరించిన అన్నమాచార్య సంకీర్తన


గానం చేస్తున్న గాయకులు గాయత్రి, సర్వజ్ఞ

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని రామాలయంలో శనివారం అన్నమాచార్య సంకీర్తన ప్రచార సమితి ఆధ్వర్యంలో అన్నమాచార్య సంకీర్తన విభావరి నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవాస భారతీయ గాయకులు వెంపటి గాయత్రి, సర్వజ్ఞలు చేసిన సంకీర్తనలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీహెచ్. శివరామకృష్ణ, రాజ్యలక్ష్మి, లక్ష్మీ ప్రసన్న, జానకి, మోహన్‌శర్మ, భార్గవి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా కృష్ణాజలాలు


లీకేజీ అవుతున్న కృష్ణాజలాలు

మర్రిగూడ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయ సమీపంలో కొన్ని రోజులుగా కృష్ణాజలాలు వృథాగా పోతున్నాయి. స్థానిక ఆదర్శ పాఠశాలకు వెళ్లే పైపులైన్ లీకేజీ అవుతుండడంతో నీరు కలుషితమవుతుంది. నీటి సరఫరా నిలిచిన అనంతరం అదే నీరు పైపులోకి వెళ్తుందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు లీకేజీలకు మరమ్మతులు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

నీలగిరి చైర్మన్‌పై అవిశ్వాస నోటీసు అందజేత

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డిపై అవిశ్వాసం పెట్టేందుకు రంగం సిద్ధమైంది. శనివారం కాంగ్రెస్ కౌన్సిలర్లు అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌కు అవిశ్వాసంపై నోటీసు అందజేశారు. అవిశ్వాసం నెగ్గాలంటే 48మంది కౌన్సిలర్లలో సగం మందికిపైగా సంతకాలు చేయాల్సి ఉంటుంది. దీంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన 26మంది కౌన్సిలర్లు సంతకాలు చేసి నోటీసు అందజేశారు. నోటీసు అందజేసిన వారిలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్‌చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, పలువురు కౌన్సిలర్లు ఉన్నారు.

రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి కేటీఆర్‌కు లేదు

కేతేపల్లి : సీఎం రేవంత్‌రెడ్డిని విమర్శించే స్థాయి మాజీ మంత్రి కేటీఆర్‌కు లేదని టీపీసీసీ మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ప్రజలు ఎన్నుకున్న ముఖ్యమంత్రి కాదని, ఢిల్లీ పెద్దలు నామినేట్ చేసిన ముఖ్యమంత్రి అని కేటీఆర్ అసెంబ్లీలో వ్యాఖ్యానించడం హాస్యాస్పదంగా ఉందన్నారు.

మంత్రి కోమటిరెడ్డి త్వరగా కోలుకోవాలని ప్రార్థనలు

నల్లగొండ : గొంతునొప్పితో హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి త్వరగా కోలుకోవాలని చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, ఏబీసీఎఫ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ రేఖల భద్రాద్రి తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి కోలుకొని అభివృద్ధి సంక్షేమ పథకాలలో పాల్గొనాలని ప్రార్థించినట్లు తెలిపారు. ప్రార్థనలో పాస్టర్లు జాన్‌బాబు, సాల్మన్‌రాజు, యేవేల్, ఎజ్రా, విజయ్ ఉన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ జన్మదినం

శాలిగౌరారం : మండల కేంద్రంలో తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిశోర్ జన్మదిన వేడుకలను శనివారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అయితగోని వెంకన్న, ఎంపీపీ గంట లక్ష్మమ్మ, పార్టీ నాయకులు చాడ హతీష్‌రెడ్డి, నూక సత్తయ్య, మామిడి సర్వయ్య, పాక రాములు, యాదయ్య, అంజయ్య, రమేశ్, సైదులు, మహేశ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

మాడుగులపల్లి: బాల్య వివాహాలతో కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన ఉండాలని ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ అన్నారు. బేటీ బచావో– బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా మాడుగులపల్లి మండలంలోని ఇందుగుల జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు శనివారం బాల్య వివాహాలు, భ్రూణ హత్యలు, వ్యక్తిగత ఆరోగ్యం, పరిశుభ్రత, గుడ్ టచ్– బ్యాడ్ టచ్ తదితర అంశాలపై ఆమె అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు నాగమణి, రజిని, హెచ్ఎం రమణారెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు నాగమణి, సునంద, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సీడీపీఓ చంద్రకళ

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


కనగల్ : వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యులు

కనగల్ : గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్యశిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రెడ్‌క్రాస్ యూత్ జిల్లా కోఆర్డినేటర్ మాద్రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని జి యడవల్లి గ్రామంలో ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ డిజెబిలిటీస్ సీనియర్ సిటీజన్స్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, మొబైల్ మెడికేర్ యూనిట్ (ఎంఎంయూ) ప్రాజెక్ట్ వారు సంయుక్తంగా 60సంవత్సరాలు పైబడిన వయో వృద్ధులకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నల్లగొండ బ్రాంచ్ సహకారంతో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో శ్రీనివాస్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. రెండు నెలల నుంచి జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ గోలి అమరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో వివిధ గ్రామాల్లో హెల్త్ క్యాంపులు నిర్వహిస్తున్నామన్నారు. ఈ శిబిరంలో గ్రామంలోని వృద్ధులు స్వచ్ఛందంగా వచ్చి వైద్యులకు ఆరోగ్య సమస్యలు తెలియజేస్తున్నారని తెలిపారు. ఈ వైద్యశిబిరంలో సుమారు 53మంది వృద్ధులకు వైద్యపరీక్షలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఈ వైద్యశిబిరంలో డాక్టర్ ఆకుల శశిధర్, రెడ్ క్రాస్ మెడికల్ ఆఫీసర్ రిటైర్డ్ డాక్టర్ ఎస్‌సీవీ రాములు, గ్రామ సర్పంచ్ యాదమ్మమారయ్య, రెడ్ క్రాస్ యూత్ వలంటీర్ వెన్నమల్ల అంజయ్య, కట్ట నాగరాజు, కర్నాటి సర్దార్ లింగాచారి, సురేష్, రెడ్‌క్రాస్ సిబ్బంది సద్దాం హుస్సేన్, శ్రీనివాస్, శ్రీకాంత్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.


నల్లగొండ టౌన్ : వినికిడి పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ రమ్య

నల్లగొండ టౌన్ : వినికిడి పరీక్షల ఉచిత వైద్యశిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శ్రావ్య స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్ నిర్వాహకురాలు డాక్టర్ నీలకంఠం రమ్య అన్నారు. శనివారం పట్టణంలోని రెడ్‌క్రాస్ కాంప్లెక్స్‌లో గల శ్రావ్య స్పీచ్ అండ్ హియరింగ్ సెంటర్‌లో ఆమె ఉచితంగా 56మందికి వినికిడి పరీక్షలను నిర్వహించారు. అనంతరం అవసరమైన సీనియర్ సిటిజన్స్‌కు, తెల్లరేషన్‌కార్డులు కలిగిన వారికి రాయితీపై వినికిడి యంత్రాలను అందించారు. ఈసందర్భంగా ఆమె మా ట్లాడుతూ.. ఆదివారం, సోమవారం కూడా తమ సెంటర్‌లో ఉచితంగా వినికిడి పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆడియాలజిస్టు సంతోష్‌కుమార్, స్వప్న, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి మండల పూజ


రామగిరి(నల్లగొండ) : పూజలు నిర్వహిస్తున్న స్వాములు, పాల్గొన్న అయ్యప్ప భక్తులు


మారుతీనగర్‌లో పూజలు నిర్వహిస్తున్న గురుస్వాములు

రామగిరి(నల్లగొండ) : పట్టణంలోని అయ్యప్పస్వామి ఆలయంలో శనివారం నందిగామ సాంబయ్య ఆధ్వర్యంలో మాలధారులు మండల పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అష్టాభిషేకాలు, అష్టోత్తర పూజలు, హోమాలు, మంత్ర పుష్పం, తీర్థ ప్రసాద వితరణ చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శివయ్య, గురుస్వాములు శ్యామ్, అశోక్, ఆలయ చైర్మన్ కొలనుపాక రవికుమార్, సెక్రటరీ బి.లక్ష్మణ్‌గౌడ్, తుపాకి భిక్షం, గుడిపాటి సత్యనారా యణ, బూరుగు బాలమల్లయ్య, హరీష్, రామారావ్, శ్రీను, కొండల్ తదితరులు పాల్గొన్నారు.

మారుతీనగర్‌లో..

పట్టణంలోని మారుతీనగర్ మణికంఠ ఆలయంలో నర్సింగ్ కుమారస్వామి ఆధ్వర్యంలో మాలధారులు అయ్యప్ప మండల పూజను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు సురేష్‌శర్మ, మాలధారులు కిరణ్, జానయ్య, శ్రీహరి, జ్యోతి, స్వామిగౌడ్, శివ, సురేష్, యాదగిరి, రాజ్యం తదితరులు పాల్గొన్నారు.


మర్రిగూడ : అన్నదానం నిర్వహిస్తున్న దాత

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

మర్రిగూడ : మండల కేంద్రంలోని అయ్యప్ప దేవాలయం వద్ద మాలధారులకు శనివారం బీఆర్ఎస్ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు నూన్సావత్ గోపి నాయక్ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అంతకు ముందు ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ నల్ల యాదయ్య, గౌడ సంఘం మండల అధ్యక్షుడు పందుల రాములుగౌడ్, అయ్యప్ప మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులు ఓటరుగా నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

మర్రిగూడ : అర్హులైన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ బక్క శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో పలు రాజకీయ పార్టీల నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1500 ఓటర్లతో, 2కిలోమీటర్లకు పైగా దూరం ఉన్న గ్రామాల్లో నూతన పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. సరంపేట గ్రామం నుంచి సరంపేటతండా వరకు 3కి.మీకి పైగా దూరం ఉందని గుర్తించామన్నారు. ఇటీవల మరణించిన వారి ఓట్లను జాబితా నుంచి తొలగించేందుకు చొరవ చూపాలన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ జూటూరు తారకరామన్, ఆర్ఐ బషీర్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనునాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముద్దం నర్సింహగౌడ్, టీడీపీ నాయకుడు పగడాల లింగయ్య, నక్క తిరుపతయ్య, కొట్టం శ్రీనివాస్, పగిళ్ల లింగస్వామి, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆటో కార్మికులు

నార్కట్‌పల్లి : రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణ పథకం ప్రవేశపెట్టడంతో ఆటో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని, ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని ఆటో యూనియన్ అధ్యక్షుడు బింగి జానయ్య కోరారు. శనివారం మండల కేంద్రంలో ఆటో కార్మికులు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో వివిధ గ్రామాలకు తిరిగే ఆటోలు 1600 వరకు ఉన్నాయని, ఆటోలు సక్రమంగా నడవకపోవడంతో కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని వాపోయారు. కార్యక్రమంలో ఆటో కార్మికులు వాకటి మారయ్య, దండు ఎల్లయ్య, ఆదిమల్ల రాములు, కమ్మంపాటి పరమేశం, వీరాంజనేయులు, సత్యనారాయణ, మధు, శంకర్, వెంకన్న, గోపి, గణేష్, రాజీవ్‌గాంధీ, వెంకట్‌రెడ్డి, చిరంజీవి, మహేష్ తదితరులు ఉన్నారు.

పాఠశాలలో విద్యార్థులకు మాక్‌పోలింగ్


కేటీఎస్ స్కూల్‌లో ఓటేసి సిరా గుర్తులు చూపిస్తున్న విద్యార్థులు.

చిట్యాల : పట్టణంలోని కేటీఎస్ (కృష్ణవేణి టాలెంట్ స్కూల్) పాఠశాలలో శనివారం విద్యార్థులు మాక్ పోలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు పీపుల్స్ లీడర్‌గా, తరగతి లీడర్స్‌గా ఎన్నికల్లో నిల్చొని వారం రోజులుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మరికొందరు విద్యార్థులు ఓటింగ్‌లో పాల్గొని పాఠశాల పీపుల్స్ లీడర్‌ను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎన్నికల అధికారులుగా వ్యవహరించి సాధారణ ఎన్నికలు తలపించేలా ఎన్నికలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ బొడ్డు యాదగిరిగౌడ్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపుకుగాను, ప్రజాస్వామ్యం, పరిపాలన వ్యవస్థలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకుగాను ఈ ఎన్నికల కార్యక్రమాన్ని పాఠశాలలో నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.